క్లుప్తంగా

నేడు బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

రామచంద్రపురం: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నేడు (ఆదివారం) బి.పవన్‌కుమార్ మెమోరియల్ ఫస్ట్ అండర్ 23 పురుషుల, మహిళల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గన్నమని చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తామని సాయంత్రం 7 గంటలకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన శ్రీవైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారిని విశేషంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ నిర్వహణ కమిటీ, దాతలు సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే టేకి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామివారిని దర్శించికొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు


విశేష అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి

కపిలేశ్వరపురం: స్థానిక పాపవినాసేశ్వర, అగస్త్యేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోశ్చరణలతో సదస్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సైన్యం విజయం కోరుతూ పూజలు


మండపేటలో పూజలు చేస్తున్న పట్టణవాసులు

కపిలేశ్వరపురం (మండపేట): భారత్–పాక్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ సైన్యం విజయం సాధించాలని కోరుతూ మండపేట వాసులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వర స్వామి, శ్రీవసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో జరిపిన పూజా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు, నియోజకవర్గ కో కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు ఎస్‌వీవీ సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి జగతా రఘువీర్, మర్రి రామచంద్రరావు పాల్గొన్నారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ


ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి సుభాష్, కలెక్టర్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.11.5 కోట్ల నిధులతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలోను పారిశ్రామిక వాడల నిర్మాణం చేయనున్న నేపథ్యంలో జిల్లా మొదటిగా ద్రాక్షారామలో సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నా ప్రభుత్వ సంకల్పంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు 39 ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ మంజూరు చేస్తే జిల్లాకు సంబంధించి రామచంద్రపురం నియోజకవర్గంలో మొదటి కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, ఆర్డీఓ దేవరకొండ అఖిల, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ ప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మకు వందనం !

- జన్మను ప్రసాదించిన మాతృమూర్తి
- బిడ్డ జీవితానికి కొండంత భరోసా
- రెండు నియోజకవర్గాల్లో విశేషంగా శ్రామిక మహిళలు
- నేడు ప్రపంచ మాతృ దినోత్సవం



అమ్మ ప్రతిమ

కపిలేశ్వరపురం: అమ్మా.. అన్నం పెట్టు, ఏమేయ్.. కాస్త మంచినీళ్ల ఇవ్వు, ఏమ్మా కోడలా.. కాస్త టాబ్లెట్ తెచ్చివ్వు, వదినా.. మా పిల్లలకు జడ వేయవూ.. ఇలా జీవితంలో అనేక పార్శ్వాల్లో మహిళ స్ఫురించగలుగుతోంది. ఆ ఓర్పు, నేర్పు నేర్పింది అమ్మ. బంధాలెన్ని ఉన్నా అందరి జీవితాలు అమ్మతోనే అనుబంధం కలిగి ఉంటాయి. ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకూ సమాజ యోగ క్షేమాలకు అమ్మ శ్రమే కేంద్రం. ఆధునిక కాలంలో అమ్మను చూసే దృష్టి లోపభూయిష్టంగా మారుతుండటం కాస్త కలవరపెడుతోంది. మారిన పరిస్థితులెలా ఉన్నా అమ్మ అమ్మే. ప్రపంచమంతా మే నెలలో రెండో ఆదివారం మాతృ దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఈ ప్రత్యేక కథనం..

అష్టకష్టాలు పడి..

అందరూ అమ్మ అనే జీవ కణం నుంచి ఉనికిలోకి వచ్చినవారే. అండ పిండాన్ని బ్రహ్మాండం చేయడంలో అమ్మకు అమ్మే సాటి. తన కడుపులో కణంగా అంకురార్పణ చేసుకోవడంతో బిడ్డకు సంబంధించిన అమ్మ ప్రస్థానం ఆరంభమవుతోంది. తొమ్మిది నెలలు తన ఇష్టాయిష్టాలను పక్కన పెట్టి బిడ్డ కోసం అష్టకష్టాలను భరిస్తుంది. ప్రసవ వేదనను సైతం కన్న బిడ్డను చూసిన మరుక్షణమే మర్చిపోయే దేవత అమ్మ. బుడిబుడి అడుగల నుంచి భవిష్యత్‌కు భరోసా దక్కే వరకూ రక్షణ కవచమవుతుంది. ఆఖరి రోజుల్లో చిన్నపిల్లగా మారి బిడ్డ చేయి ఊతమల్లె పట్టుకుని తప్పటడుగులు వేస్తోంది. తుది శ్వాస విడుస్తూ బిడ్డా జాగ్రత్త అంటూ తన ప్రస్థానానికి బాధ్యతతో కూడిన ముగింపు పలుకుతోంది. అందుకే అమ్మకు ఈ సృష్టిలో విశిష్ట స్థానం ఉంది.

అమ్మ శ్రమే జగతికి మూలం

సమాజంలో అమ్మ పాత్ర విశేషమైంది. బిడ్డకు జన్మనివ్వడమే కాకుండా సామాజిక ఉత్పత్తిలో సగాన్ని తన శ్రమతో అమ్మే సృష్టిస్తోంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో మహిళలు విశేషంగా శ్రమ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ, పారిశ్రామిక క్షేత్రాల్లో కూలీలుగా పని చేస్తున్నారు. శారీరక శ్రమ చేసే కూలీగా, మానసిక శ్రమ చేసే డాక్టరు, లాయర్లు, ఉద్యోగ, వ్యాపార రంగాల్లోనూ రాణిస్తున్నారు. చిరుద్యోగి, ఆశ, అంగన్‌వాడీ, కార్యకర్తలుగా సేవాపథంలో నడుస్తున్నారు. ప్రజా సంఘాల్లో చేరి సమాజ సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తూ నాన్న దూరమైన కుటుంబంలో ఒంటరి మహిళగా పిల్లలను సాకడంలో అమ్మ కష్ట నష్టాలకు ఓర్చుతుంది. బాధ్యత తెలిసిన వారెవరైనా అమ్మ ఆప్యాయతను పొందడమే కాకుండా ఆమె శ్రమకు విలువ ఇవ్వాలి. చేతనైన స్థాయిలో అమ్మను సంతోష పెట్టాలి.

సామాజిక సేవే లక్ష్యంగా..



జీవితమంటే ఇల్లు, పిల్లలే కాదు. చుట్టూ ఉన్న సమాజం కూడా అని అంటుంది మా అమ్మ దుర్గారాణి. సామాన్యులకు సేవ చేయాలనే సామాజిక బాధ్యతతో అమ్మ రాజకీయాల్లోకి వచ్చారు. మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గెలిచి, పట్టణ ప్రజలకు తన వంతు సేవ చేస్తున్నారు. అమ్మ పట్ల ప్రజల ఆదరణను చూసినప్పుడు నాకు, సోదరుడు మనోజ్‌కు చాలా సంతోషమేస్తోంది.

పతివాడ లోకేష్,
మున్సిపల్ చైర్‌పర్సన్ కుమారుడు, మండపేట

చదువు ప్రాధాన్యతను వివరించి..



సామాన్య కుటుంబానికి చెందిన నేను ఎమ్మెస్సీ పూర్తి చేశాను. చిన్ననాటి రోజుల్లో అమ్మ శ్యామలాదేవి కష్టం విలువను తెలియజెప్పి చదువు ప్రాధాన్యతను వివరించింది. స్వశక్తితో వృద్ధిలోకి రావాలన్న ఆమె మాటలు నాతోబాటు అక్కచెల్లెలకు ఉత్తేజాన్నిచ్చాయి. నేను, అక్క జీవితంలో స్థిరపడ్డాం. అమ్మకు థాంక్స్.

అదపా తనూజ, సుందరపల్లి,
కె.గంగవరం మండలం

కలెక్టర్ సమక్షంలోనే ప్రొటోకాల్‌కు తిలోదకాలు



సభలో ప్రాధాన్యత లేకుండా వెనుక వరుసలో కూర్చున్న ఎంపీపీ భవాని తదితరులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గంలోని ద్రాక్షారామలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణ భూమి పూజలో సంబంధిత అధికారులు సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సమక్షంలోనే ప్రొటోకాల్‌ను తుంగలో తొక్కారు. వివరాల్లోకి వెళితే ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ నిమిత్తం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు పిలుపు రావడంతో వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతిలు హాజరయ్యారు. అయితే శిలాఫలకం ఆవిష్కరణలో కానీ, స్టేజీపై జ్యోతి ప్రజ్వలన సమయంలో కానీ సహజంగా ఎవరైనా మహిళా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా చేయిస్తారు. కానీ శనివారం నాటి కార్యక్రమంలో వారిని కనీసం పిలవలేదు. దీనికి తోడు స్టేజీపైకి అందరితో పాటు వెళ్లినా పేర్లు చెప్పే క్రమంలో ఎంపీపీ భవానిని పిలిచినప్పటికీ ద్రాక్షారామ ఎంపీటీసీలు అయిన వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి, నున్న సత్యవతిల పేర్లు చెప్పకపోవడంతో వారు అవమానకరంగా భావించి స్టేజీ దిగిపోయే ప్రయత్నం చేశారు. దీనితో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి కల్పించుకుని వారి పేర్లు పిలవడంతో కూర్చున్నారు. ప్రొటోకాల్ పాటించకుండా కూటమికి చెందిన చోటామోటా నాయకులు అందరిపేర్లు స్టేజీపైకి పిలవడంపై సభలో చర్చ నడిచింది. సభలో గత ఎన్నికల ముందు టీడీపీలో చేరిన సర్పంచ్ కొత్తపల్లి అరుణను మాత్రం ముందు వరుసలో కూర్చోబెట్టి ఎంపీపీ సహా అందరినీ ప్రాధాన్యం లేకుండా వెనుక కూర్చోబెట్టడంపై చర్చించుకున్నారు.

భారీవర్షాలతో కూరగాయల సాగుకు అపారనష్టం


గొల్లపాలెంలో భారీ వర్షాలకు దెబ్బతిని కుళ్లిపోతున్న బీరపాదులు

కాజులూరు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పంట నీట తడవగా మెట్ట దిమ్మలపైన, పొలాలగట్ల పైన సాగుచేసిన కాయకూరల తోటలు తీవ్రంగా నష్టపోయాయి. మండలంలోని గొల్లపాలెం, బందనపూడి, ఆర్యావటం తదితర గ్రామాల్లో రైతులు పొలాల మధ్య దిమ్మలపై బీర, బెండ, వంగ తదితర కూరగాయలు సాగు చేస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. రోజుల తరబడి నీరు ఉండిపోవటంతో పాదులు, మొక్కలు చనిపోతున్నాయి. వర్షాల సమయానికి బీర పాదులు పూత, పిందెలతో కాపుకు వచ్చాయని ప్రస్తుతం అవి కుళ్లిపోతుండటంతో వాటికి పెట్టిన పెట్టుబడితో పాటు, శ్రమ వృథా అయిందని గొల్లపాలేనికి చెందిన రైతు కర్రి దుర్గారెడ్డి వాపోతున్నాడు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి కాయగాయల పంటలకు నష్టపరిహారాలు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

వీరుల త్యాగం వృథా కాదు


కపిలేశ్వరపురంలో జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: దేశ రక్షణలో ప్రాణాలను పనంగా పెట్టి పోరాడిన వీరుల త్యాగం ఎప్పటికీ వృథా కాదని పలువురు వక్తలు అన్నారు. గ్రామంలో ఏపీకి చెందిన జవాన్ మురళీనాయక్ సంతాప సభ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో ఏపీఎన్‌జీఓ సంఘం మండపేట జోన్ అధ్యక్షుడు జిత్తుక మల్లికార్జునుడు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తలు జవాన్‌కు ఘనంగా నివాళి అర్పించారు. మల్లికార్జునుడు, సర్పంచ్ సాకా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దుశ్చర్యలను ధైర్య సాహసాలతో ప్రతిఘటిస్తూ ప్రాణాలు విడిచిన మురళీనాయక్ ప్రాణ త్యాగం చిరస్థాయిగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కట్టా మురళి, చింతా పెద్దకాపు, మల్లిపూడి శివకుమార్, మేకా అచ్యుతరామయ్య, దొమ్మేటి వీర్రాజు, జిత్తుక శ్యాంప్రసాద్, నేతల అన్నవరం, పితాని రామచంద్రరావు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు నివాళి


మురళీ నాయక్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల


కపిలేశ్వరపురం (మండపేట): దేశ రక్షణ కోసం విధులు నిర్వస్తుండగా అమరుడైన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో తనతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కౌన్సిలర్లు నివాళి అర్పించారు.

మాతృమూర్తికి వందనం


ద్వారపూడిలో తల్లి పాదాలకు నమస్కరిస్తున్న చిన్నారులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ మండపేట సీడీపీఓ అధికారి గజలక్ష్మి పర్యవేక్షణలో సెక్టార్ సూపర్‌వైజర్ పి.సునీత ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ ఈతకోట కిన్నెర మాట్లాడుతూ యావత్ ప్రాపంచిన నడవడికకూ మూలం అమ్మే అన్నారు. తల్లి పాదాలకు చిన్నారులు నమస్కారం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సాయిలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, ఆయాలు, చిన్నారుల తల్లులు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

నెమలి ఫించంపై మాతృదినోత్సవ చిత్రాలు


నెమలి పింఛంపై చిత్రించిన తల్లీబిడ్డల చిత్రాలు


త్రినాథ ప్రసాద్

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ రాయుడు త్రినాథప్రసాద్ ఆదివారం మాతృ దినోత్సవం పురస్కరించుకుని నెమలి పింఛంపై తల్లీ బిడ్డల చిత్రాలను చిత్రించి ఔరా అనిపించాడు. డ్రాయింగ్ టీచర్ త్రినాథప్రసాద్‌ను హెచ్‌ఎం కేకేఎల్ కుమారి, సహ ఉపాధ్యాయులు అభినందించారు.

కోడు కాలువకు మోక్షం


యంత్రం సాయంతో జరుగుతున్న కోడు కాలువ పూడికతీత పనులు

ఆలమూరు: ఆలమూరు నుంచి పెనికేరు వెళ్లే రహదారిలోని కోడు కాలువకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని సుమారు పది గ్రామాలకు ఉపయోగపడే ఈ పంటకాలువ గత 20 ఏళ్ల నుంచి ఆధునీకరించకపోవడంతో గుర్రపుడెక్క, తూటుకాడతో మూసుకుపోయింది. దీనిపై రైతులు ఇచ్చిన ఫిర్యాదుతో చింతలూరు నీటి సంఘం అధ్యక్షుడు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర వైస్ చైర్మన్ గారపాటి శ్రీనివాస చౌదరి స్పందించి అధికారుల సహకారంతో శనివారం పూడికతీత పనులను ప్రారంభించారు. రాబోయే ఖరీఫ్‌కు కోడు కాలువను పూర్తిస్థాయిలో ఆధునీకరించి, ఆక్రమణలను తొలగించి రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని చైర్మన్ గారపాటి హామీ ఇచ్చారు.

ముగిసిన సమ్మర్ క్యాంపులు


రావులపాలెంలో విద్యార్థులు, ఉపాధ్యాయిలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈవో సలీం బాషా

రాయవరం: ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సమ్మర్ ప్రత్యేక క్యాంపులు శనివారంతో ముగిశాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్దేశించిన పాఠశాలల్లో ప్రత్యేక సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో జిల్లాలోని రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, ఏడిద, మండపేట, రామచంద్రపురం సమ్మర్ క్యాంపులు నిర్వహించారు. ఆయా మండలాల విద్యాశాఖాధికారులు, సెక్టోరల్ అధికారులు ఈ క్యాంపులను పర్యవేక్షించారు. ఈ శిబిరాల ద్వారా విద్యార్థులకు వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయులతో బేసిక్స్, ప్రాథమిక అంశాల్లో శిక్షణనిచ్చారు. క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్లు చిత్రలేఖనంలో ప్రత్యేక శిక్షణ నిచ్చారు. పలువురు సబ్జెక్టు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా శిక్షణా శిబిరాల్లో పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాలకు విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఏప్రిల్ 26న ప్రారంభమైన వేసవి శిక్షణా శిబిరాలు శనివారంతో జిల్లా వ్యాప్తంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆయా వేసవి శిక్షణా శిబిరాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: వేసవిలో విద్యార్థులకు అవసరమయ్యే చదువు, క్రీడలకు సంబంధించిన ఉచిత శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ మోకా ప్రకాష్ కోరారు. హైదరాబాద్‌కు చెందిన వినాయక యాడ్స్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఇంగ్లీష్, కమ్యునికేషన్ స్కిల్స్ తరగతులను హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంఈఓ ప్రకాష్ మాట్లాడుతూ 30 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే పెన్నులు, పుస్తకాలతో పాటు ఇంగ్లీష్ మెటీరియల్‌ను విద్యార్థులకు వినాయక యాడ్స్ అధినేత బి.వినాయకరావు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఉపాధ్యాయులు బీఎస్‌ఎన్ మూర్తి, బొంతు రమేష్, మేడిద జాని పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మల్లవరం వంతెన


అప్రోచ్ లేక ప్రమాదకరంగా మారిన వంతెన

కె.గంగవరం: మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ శివారు మల్లవరం వద్ద ఉన్న వంతెనకు అప్రోచ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గ్రామంలో పంట కాలువకు సుమారు ఐదేళ్ల క్రితం నాబార్డు నిధులతో నూతన వంతెన నిర్మాణం జరిగింది. అయితే అప్పట్లో నాసిరకం కంకర వాడడం వల్ల కొంత వరకు అప్రోచ్ కాలువలోకి కొట్టుకుపోయింది. మిగిలిన సగం ఇటీవల కురిసిన వర్షాలకు పంట కాలువలోకి కొట్టుకుపోయింది. అప్రోచ్ లేకపోవడంతో వాహనాదారులు ఇక్కడ ప్రమాదాల బారిన పడుతున్నారని ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్ అంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వంతెనకు అప్రోచ్ నిర్మించాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

కాజులూరు: భారీ వర్షాల కారణంగా మండల గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని కుయ్యేరు, దుగ్గుదుర్రు, కాజులూరు, చేదువాడ, గొల్లపాలెం, శలపాక తదితర గ్రామాల్లో కృష్ణమూర్తి తదితర నాయకులు పర్యటించి వర్షాలకు నీటతడిసిన వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. చేదువాడలో ఆయన మాట్లాడుతూ నీట తడిసిన, రంగుమారిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం, మండల సేవాదళ్ అధ్యక్షుడు పాలిక వీరబాబు, మండల అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు చింతా నవీన్, సంఘ సభ్యులు గుత్తుల లోవరాజు, పెంకే దుర్గాప్రసాద్, సువ్వారి గోవిందు, దంగేటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై సూచనలు ఇవ్వండి

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ అధికారులకు తగిన సూచనలు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులను చక్కదిద్దాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన హెల్త్ సిబ్బంది, ఏఎన్‌ఎంల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చెదురుమదురు వర్షాల కారణంగా గ్రామాల్లో అపారిశుధ్యం తలెత్తి వాతావరణం కలుషితమవుతుందన్నారు. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచడంతో పాటు ఎప్పటికప్పుడు వీధులు శుభ్రం చేసి డ్రైనేజీలు మెరుగుపరచేలా పంచాయతీ సిబ్బందికి సూచించాలన్నారు.

అంతర్వేది ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీ


అంతర్వేది ఆలయ వాహన శాలలో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలపై బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. భారత్, పాక్ యుద్ధ వాతావరణం దృష్ట్యా సఖినేటిపల్లి ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పర్యవేక్షణలో బాంబ్ స్క్వాడ్ సిబ్బంది వివిధ ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అదే విధంగా ఆలయంలో భక్తులను, సిబ్బందిని మరింత అప్రమత్తం స్క్వాడ్ సిబ్బంది చేశారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12,500 ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. గ్రామానికి చెందిన ఆకుల లోవరాజు (31) రెండు రోజులు క్రితం నాగుల్లంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఒక కాలు తొడ భాగంలో మోకాలి కింది భాగంలో బాగా నలిగిపోయింది. ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఇంకా రెండు ఆపరేషన్లు చేయాలని డాక్టర్లు చెప్పారు. వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలోని లోవరాజు పిన్ని వెంకటలక్ష్మికి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12,500 చెక్కును అందజేశారు.